ప్రాణాలంటే లెక్క లేదా?



అక్కడ ఉద్యోగం నిప్పుతో చెలగాటం.. అగ్ని గుండంతో సహవాసం. అప్రమత్తతకు ప్రతీ క్షణం పరీక్ష. రక్షణ కవచాలు ఉన్నా.. ప్రమాదవశాత్తు అనుకోని ఘటన జరిగితే ఉద్యోగులు, కార్మికులకు ప్రాణ సంకటమే.. నిత్యం అగ్నితో ఉద్యోగం చేసే కార్మికులు, ఉద్యోగుల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అనుకోని ప్రమాదాల్లో గాయపడిన వారికి వైద్యం అందించే బర్న్ యూనిట్ తెరవకుండా తాత్సారం చేస్తోంది. ఫలితంగా ప్లాంట్‌లో ప్రమాదాలు సంభవించినప్పుడు గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

- ఉక్కు ఆస్పత్రిలో బర్న్ యూనిట్ మూత
- క్షతగాత్రులకు సకాలంలో అందని చికిత్స
- ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు
- యూనిట్ పునరుద్ధరించాలని ఉద్యోగుల డిమాండ్

ఉక్కునగరం: సల సల కాగే అగ్నికీలల మధ్య ఉక్కు ఉత్పత్తి సాగుతోంది. ఈ ప్రక్రియలో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు అనేక రకాలుగా గాయాల బారిన పడుతుంటారు. వీరికి చికిత్స అందించడానికి జనరల్ ఆస్పత్రిలో బర్న్ యూనిట్ లేకపోవడంతో సకాలంలో వైద్యం అందడం లేదు. బర్న్‌యూనిట్‌ను పునఃప్రారంభించాలనే విజ్ఞప్తిని యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘోర ప్రమాదంలో ఆదుకున్న యూనిట్

2012లో స్టీల్‌ప్లాంట్ విస్తరణలో భాగంగా ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభంలో జరిగిన ఘోర ప్రమాదంలో 18 మంది మృత్యువాత పడిన విషయం విదితమే. అప్పుడు కూడా బాధితులకు వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందజేశారు. దీంతో చాలా మంది ప్రాణాలు నిలబడ్డాయి. అటువంటి బర్న్ యూనిట్‌ను యాజమాన్యం నిర్లక్ష్యం చేసి పూర్తిగా మూసి వేసింది. కరోనా తర్వాత ఉక్కు ఆస్పత్రి యాజమాన్యం బర్న్ యూనిట్‌ను పూర్తిగా మరిచి పోయేలా చేసింది.

ఎందుకు మూసేశారో..

స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి ప్రారంభంలో అన్ని విభాగాలతో పాటు బర్న్ యూనిట్ కూడా ఏర్పాటు చేశారు. దీనివల్ల స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందేది. వీరితో



ఉక్కు జనరల్ ఆస్పత్రి

పాటు ఉత్తరాంధ్రలోని పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో బాధితులకు ఈ యూనిట్‌లో చికిత్స అందించేవారు. క్రమేణా ఈ యూనిట్ ఉత్తరాంధ్రలోనే బెస్ట్ బర్న్ యూనిట్‌గా గుర్తింపు పొందింది. అలాంటి యూనిట్‌ను మూసివేశారు.

ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు.. ఉక్కులో ప్రమాదం సంభవిస్తే ఇప్పుడు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల మూడు ప్రమాదాల్లో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు గాయాలపాలయ్యారు. ఉక్కు జనరల్ ఆస్పత్రిలో బర్న్ యూనిట్ లేకపోవడంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స అందక పోవడంతో కొంత మంది మృత్యువాత పడగా.. మరికొంత మంది కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతోంది. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి బర్న్ యూనిట్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

బర్న్ యూనిట్ పునరుద్ధరించాలి



ఉక్కు జనరల్ ఆస్పత్రిలో బర్న్ యూనిట్ లేకపోవడం అన్యాయం. బాధితులను నగరంలోని ఆస్పత్రికి తరలించాల్సి వస్తుంది. ఫలితంగా బాధితులకు సకాలంలో చికిత్స అందడం లేదు. ఆస్పత్రికి అతి ముఖ్యమైన బర్న్ యూనిట్ పునరుద్ధరణకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.

-యు. రామస్వామి, ప్రధానకార్యదర్శి, స్టీల్ సీఐటీయూ

1400 నుంచి 1700 డిగ్రీల ఉష్ణోగ్రత మధ్య ఉక్కు ఉత్పత్తి

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో హాట్ మెటల్, స్టీల్ మెల్ట్ షాప్‌లో లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి సుమారు 1400 నుంచి 1700 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య జరుగుతుంది. ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా హాట్ మెటల్, లిక్విడ్ స్టీల్ తరలించే లేడల్‌కు రంధ్రాలు పడడం, వేడి మెటల్ నీటిలో పడడం ద్వారా పెద్ద ఎత్తున పేలుడు సంభవించి ఉక్కు పరిశ్రమలో ప్రమాదాలు సంభవిస్తాయి. అలాంటి సమయంలో గాయపడిన వారికి చికిత్స అందించి ప్రాణాలు నిలిపిన బర్న్ యూనిట్‌ను మూసి వేసినప్పటి నుంచి ఉక్కు కార్మికులకు కాలిన గాయాల చికిత్సకు వైద్యం అందడంలో జాప్యమవుతోంది.



బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రక్రియ

సుధాకర్ సేవలు అమూల్యమైనవి



సంతాప సభలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి అధికారి మంచూరి సుధాకర్ సేవలు అమూల్యమైనవని పలు కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు కొనియాడారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉక్కు జనరల్ ఆస్పత్రి అధికారి సుధాకర్‌కు ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కళాక్షేత్రంలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా సుధాకర్ ముందుండే వారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సారంగి, మాజీ విభాగాధిపతి డాక్టర్ నవీన్‌కుమార్, నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, రామ్మోహన్‌కుమార్, సింహాద్రి, సుబ్బరాజు, మహేష్, వరసాల శ్రీనివాసరావు, డి. సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడికి విశేష పూజలు



విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సహిత తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కార్తీక మాసం ఆఖరి రోజు పురస్కరించుకొని తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి ప్రత్యేక పూలతో అర్చన చేశారు. విశేష అలంకరణలో తిరుమలేశుడు భక్తులకు దర్శనమిచ్చాడు.

క్లుప్తంగా

గురజాడ జీవితం స్ఫూర్తిదాయకం



గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

అక్కిరెడ్డిపాలెం: మహాకవి గురజాడ అప్పారావు జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని ఐద్వా జిల్లా నాయకురాలు వై.సత్యవతి అన్నారు. 69వ వార్డు షీలానగర్‌లో ఆదివారం ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకురాలు మూర్తమ్మ గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా నాయకులు జి.మణి, ఎస్.నాగవేణి, డి.శ్రీదేవి, బేబీ, మానస, సునీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ వర్క్స్ ఇన్‌చార్జిగా రంజన్ మొహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీజీఎం వర్క్స్ ఇన్‌చార్జిగా ప్రస్తుత సీజీఎం (ఐరన్, స్టీల్, యుటిలిటీస్) రంజన్ మొహంతి నియమితులయ్యారు. ఇప్పటి వరకు వర్క్స్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన ఉప్పలపాటి శ్రీధర్ శనివారం పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో మొహంతిను నియమిస్తూ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎ.కె.బాగ్చీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

బ్రహ్మసూత్ర శివాలయంలో పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి సీతారామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఘనంగా కార్తీక మాస పూజలు నిర్వహించారు. బ్రహ్మసూత్ర శివాలయంలో పూజల అనంతరం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ కోఆర్డినేటర్ బొడ్డ గోవింద్, నాయకులు తాతనాయుడు, మింది గోవింద్, బొండా గోవిందరాజులు, కర్రికృష్ణ, మాటూరి రాము, శ్రీధర్ పాల్గొన్నారు.

ముగిసిన లక్ష దీపోత్సవం



శ్రీనివాస గోవిందుడు, దామోదర కృష్ణునికి నేతిదీపంతో నీరాజనం

తగరపువలస: ఆనందపురం మండలం గంబీరం ఐఐఎంబీ రహదారిలో హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా శ్రీవైకుంఠ శ్రీనివాసునికి, శ్రీ దామోదర కృష్ణునికి నిర్వహిస్తున్న లక్ష దీపోత్సవం ఆదివారంతో వైభవంగా ముగిసింది. నిర్వాహకులు గోవిందునికి, దామోదర కృష్ణునికి, భక్తి వేదాంత స్వామి ప్రభు పాదుల వారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చివరి రోజు దీపాల వెలుగులు, సంగీత వాయిద్యాల నడుమ భక్తులు భగవంతుని సేవలో నాట్యం చేస్తూ తన్మయులయ్యారు. తులసి హారతి, తులసి మహారాణికి పూజలు నిర్వహించి ఆమె చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కామిరెడ్డి సత్యనారాయణచే ఆకాశదీపం, శృతిచే తొలి నేతి దీపం ఆవిష్కరించారు. దామోదర అష్టకం పఠించారు. వివిధ ఆకృతులలో భక్తులు దీపాలు వెలిగించారు. మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస భక్తులను ఉద్దేశించి ప్రవచించారు. యుగాలన్నింటిలో సత్యయుగం, శాస్త్రాలలో వేదం, నదులలో గంగ, మాసాలలో కార్తీకం ఉత్తమమైనవన్నారు. కార్తీక వ్రతం ఆచరిస్తే అనేక పుణ్యనదులలో స్నానం, సంపద దానం చేస్తే వచ్చే ఫలితం కంటే కోటి రెట్లు ఫలితం ఉంటుందన్నారు. చివరగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అరికట్టాలని భక్తులు ప్లకార్డులు ప్రదర్శించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



హరిజనజగ్గయ్యపాలెం సమస్యలపై ఎమ్మెల్యే పల్లా కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులోని హరిజనజగ్గయ్యపాలెంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పర్యటించారు. గ్రామంలో నెలకున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో గ్రామంలో అభివృద్ధికి, కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రాజు, వి.గోపి, యు.ప్రవీణ్, పి.రవి పాల్గొన్నారు.

- విశాఖ జిల్లా టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు మల్లికేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు అతికినశెట్టి సత్యనారాయణ, న్యాయసలహాదారు తెలగారెడ్డి పుల్లయ్య నాయుడు, ప్రధానకార్యదర్శి దొడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్‌కు చెక్



అగనంపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని అవగాహనతోనే నివారించవచ్చని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తర్వాత రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం ప్రజల్లో చైతన్యం రావడం, అవగాహన వల్ల ఎయిడ్స్ వ్యాప్తి చాలా వరకు తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి పాల్గొన్నారు.

అగనంపూడిలో..

85వ వార్డు అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.సంతోషి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితుల్లో మహిళలే ఎక్కువ ఉన్నారని, వీరితో పోలిస్తే పురుష బాధితులు తక్కువ అన్నారు. అపరిచితులతో లైంగిక సంబంధాలు వద్దన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ రవి, ప్రజాసంఘాల నాయకులు బి.సత్యనారాయణ, కె.తాతారావు, ఎ.ఈశ్వరావు, జి.అప్పారావు, కె.హనుమంతురావు, శ్రీనివాసరావు, పి.ఆశాలత తదితరులు పాల్గొన్నారు.



రెడ్ రిబ్బన్‌గా ఏర్పడిన ఫార్మా కళాశాల విద్యార్థులు

వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సీతంపేట: వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో, అసోసియేషన్ న్యూ పేట్రన్ కమల్‌బైద్ మాట్లాడుతూ ప్రతిభను చాటి పతకాలను సాధించిన మన అథ్లెట్స్ అంతర్జాతీయ క్రీడా వేదికపై విశాఖ కీర్తి పతాకాన్ని ఎగురవేయాలన్నారు. అథ్లెట్ అసోసియేషన్ బలోపేతానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి క్రీడాకారులకు సహకారం అందిస్తామని తెలిపారు. జగద్గురు పీఠం డైరెక్టర్, అసోసియేషన్ న్యూ అడ్వైజర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ సామాజిక సేవా సంస్థ జనకులం ఫౌండేషన్ ద్వారా ఔత్సాహిక క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



భక్తులచే పూజలు చేయిస్తున్న అర్చకుడు వాసుదేవశర్మ

పెదగంట్యాడ: కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన కాలభైరవ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వాసుదేవశర్మ భక్తుల పేరిట పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవ స్వామికి ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



జగ్గు జంక్షన్ వద్ద ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గాజువాక : హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై స్థానిక డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. అనంతరం చిన్నారులు జగ్గు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకొనే వ్యాధి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. హెల్ప్ ది హెల్ప్ లెస్, సోల్స్ ఆఫ్ హ్యుమానిటీ సభ్యులు, డిజైర్ సొసైటీ ప్రతినిధులు పి.లక్ష్మణ్, ఎస్.వి.కె.పరశురామ్, జొన్నకూటి విజయ్ కుమార్, పూర్ణిమ, ఎస్.రజనీ కుమారి, పి.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అనధికార పార్కింగ్‌లతో అవస్థలు



వందడుగుల రోడ్‌లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిలిపివేసిన వాహనాలు

గాజువాక: నిత్యం రద్దీగా ఉండే గాజువాకలో వాహనాల పార్కింగ్ సమస్యగా తయారైంది. భారీ వాహనాలను సైతం జనావాసాల మధ్య, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ట్రక్ టెర్మినల్ లేకపోవడం వల్ల ట్యాంకర్లు, లారీలు, ట్రాలర్ల పార్కింగ్ సమస్యాత్మకంగా మారింది. పోలీసుల అనుమతితో శ్రీనగర్‌వద్ద, షీలానగర్ జాతీయరహదారిపైనా వాహనాలు నిలుపుతున్నారు. అనధికారికంగా చినగంట్యాడలోని 100 అడుగుల రోడ్‌లోను నిలిపివేస్తున్నారు. రోడ్లపైనే వాహనాలు నిలిపివేస్తుండటంతో నిత్యం ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతోంది. తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకొంటున్నాయి. అనధికార పార్కింగ్ వద్దని ట్రాఫిక్ పోలీసులు చెప్పినా వినే పరిస్థితి లేదు. సరైన స్థలం లేదనే కారణంతో ట్రక్ టెర్మినల్ వ్యవహారం వెనక్కి పోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. ఫలితంగా జనం నిత్యం ఇబ్బందులతో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. భారీ లారీలతోపాటు ప్రైవేటు బస్సులను కూడా ఇక్కడ నిలిపివేస్తుండటంతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఎదురుగా వాహనాలను నిలిపివేస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా చిన్మయ మిషన్ గీత ఫెస్ట్–2024



విజేతలతో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ప్రసాద్, చిన్మయ మిషన్ రఘువీరానంద

ఉక్కునగరం: చిన్మయ మిషన్ జిల్లా స్థాయి గీత ఫెస్ట్–2024 ఘనంగా జరిగింది. చిన్మయ మిషన్ ఉక్కునగరం చాప్టర్ ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. చిన్మయ మిషన్ చాప్టర్ అధ్యక్షుడు రఘువీరానంద ఆధ్వర్యంలో మహిళలతో ఏర్పడిన దేవి గ్రూప్ ఉపాధ్యాయులు విద్యార్థులకు భగవద్గీత ద్వారా లాంగ్వేజ్ స్కిల్స్, వాల్యూ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన సుమారు 12 వేల మందికి పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించారు. అందులో ఎంపిక చేసిన 150 మందికి జిల్లా స్థాయి పోటీలు ఉక్కునగరం క్లబ్ ఎంపీ హాలులో నిర్వహించారు. పోటీలను స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ, హిందుస్థాన్ షిప్‌యార్డ్ జీఎం జి. శ్రీనివాసరావు, చిన్మయ మిషన్ అధ్యక్షుడు రఘువీరానందలు ప్రారంభించారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ కార్యదర్శి జయంతి కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.వి. స్వామి తదితరులు పాల్గొన్నారు.



చిన్మయ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

క్రీడా నైపుణ్యం వెలికితీసేలా పోటీలు



ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను ఆదివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ క్రీడా మైదానంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు ప్రారంభించారు. ఈ పోటీలకు ఏయూ ఎఫిలియేషన్ కళాశాలల నుంచి వంద మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి మేరకు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ సాధించిన క్రీడాకారులు ఏయూ జట్టు తరపున పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు.